క్లుప్తంగా

శిక్షణతో బోధన మెరుగు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా పద్ధతులు ఎప్పటికప్పుడు మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు బాధ్యతగా నిర్వహించాలని ఎంఈఓలు శాంతారావు, పి.దాలినాయుడులు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, కోటబొమ్మాళి మండలాలకు చెందిన హైస్కూల్ హెచ్ఎంలకు శిక్షణ సమావేశం మంగళవారం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్‌లో పాటించాల్సిన పద్ధతులు, ఉపాధ్యాయులకు ఇవ్వనున్న సూచనలపై సమీక్ష చేశారు. హెచ్ఎంలకు పలు సూచనలు చేశారు. ఈ నెలలో 28, 29 వ తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంఈఓలు పాల్గొన్నారు.

16న ప్రతిభా పరీక్ష

జలుమూరు: గీతాజయంతి పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీన శ్రీముఖలింగం ఉన్నత పాఠశాలలో ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు గీతా సత్సంగం ప్రతినిధులు, హెచ్ఎం పి.విశ్వేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 14వ తేదీలోగా పదో తరగతి విద్యార్థులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పరీక్ష 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుందన్నారు. తెలుగు, ఆధ్యాత్మికం, ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, బయోలాజీ, సోషల్, కరంట్ అఫైర్స్ 10 మార్కుల చొప్పున ఉంటాయన్నారు. ప్రథమ బహుమతి రూ.1500, ద్వితీయ బహుమతి రూ.1,000, తృతీయ బహుమతి రూ.500 లతోపాటు జ్ఞాపికలు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. రిజిస్ట్రేషన్‌కు ఫోన్ 94906 38256, 63048 10167, 80082 75805 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వరి కుప్ప దగ్ధంపై ఫిర్యాదు

హిరమండలం: తనకు చెందిన ఎకరా వరి కుప్పను ఉద్దేశపూర్వకంగానే కొండరాగోలుకు చెందిన నాసర ప్రసాద్ దగ్ధం చేశారని నౌగూడ గ్రామానికి చెందిన కొల్ల శిమ్మయ్య అనే గిరిజనుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హిరమండలం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. నవంబర్ 25వ తేదీ అర్ధ రాత్రి సమయంలో కొరాడ సమీపంలోని పొలాల్లో ఉన్న వరి కుప్పకు ప్రసాద్ మంట పెట్టినట్లు శిమ్మయ్య తెలిపారు. సుభలాయి గ్రామానికి చెందిన నాగరాజు అనే రైతుకు చెందిన ఎకరా పొలం కౌలుకు తీసుకున్నట్లు చెప్పారు. కొద్ది రోజుల కిందట తాను సాగుచేస్తున్న పొలంలో ప్రసాద్ గొర్రెలు మేపటంతో ప్రశ్నించానని, కులం పేరుతో దూషించాడని తెలిపారు. వరి కుప్ప దగ్ధమైన సమయంలో అనుమానాస్పదంగా ప్రసాద్ అక్కడే కనిపించాడన్నారు. ఆయనపై అనుమానం ఉందని, గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్తే నష్టపరిహారం ఇస్తానని అంగీకరించాడని, నాలుగైదు రోజులుగా పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని తెలిపారు. అందుకే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ఆలస్యమైందన్నారు. దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు


గాయపడిన జగదాంబ

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బోర జగదాంబకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోని శుభ కార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డు దాటుతున్నప్పుడు వెనక నుంచి వచ్చిన గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రురాలను శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గిరిజన గ్రామాల్లో పీఓ పర్యటన


గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ

హిరమండలం: మండలంలోని పెద్దగూడ పంచాయతీ పరిధి పెద్దగూడ, పొలంగూడ గిరిజన గ్రామాల్లో సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి మంగళవారం పర్యటించారు. ఏయే పంటలు పండిస్తున్నారు, పంటలు ఎక్కడ విక్రయిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. చీపురు, జీడి, పసుపు, చింత, అల్లం పండిస్తున్నట్లు గిరిజన రైతులు తెలిపారు. సరైన మార్కెట్ సదుపాయంలేక దళారులకే విక్రయిస్తున్నామన్నారు. పసుపు ప్రోసెసింగ్ మిషన్ కూడా ఉందని, ప్యాకింగ్ కవర్లు, మార్కెటింగ్‌పై అవగాహన లేదన్నారు. పండించిన పంటలకు మార్కెటింగ్, గ్రేడింగ్ చేసే విధానాలపై శిక్షణ ఇప్పిస్తామని పీఓ చెప్పారు. కొండూరు జీపీఎస్ పాఠశాలకు మెట్లు, తాగునీటి సదుపాయం కల్పిస్తామన్నారు. సర్పంచ్ నందిని, ఎంపీటీసీ లక్ష్మణ్, మర్రిగూడ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు యాత్రకు ఏర్పాట్లు పూర్తి


పాతపట్నం: సభా వేదిక ఏర్పాట్లను నారాయణమూర్తితో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నంలో బుధవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మెయిన్ రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద బహిరంగ సభకు ఏర్పాట్లను నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తితో కలిసి ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. సాధికార యాత్రకు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. రెడ్డి శ్రావణ్, సీఐ వినోద్ బాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.అప్పన్న, నాయకులు పనుకు మోహన్, చీకటి పద్మరాజు, మొర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెళియాపుట్టి: పాతపట్నంలో బుధవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని మెళియాపుట్టి జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, పార్టీ నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్ అన్నారు. మెళియాపుట్టిలో మంగళవారం మాట్లాడుతూ.. ప్రజాసాధికారితకు పెద్ద పీటవేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే మంచి ఆలోచనే సాధికారత బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పార్కింగ్ ఇలా..

బస్సు యాత్ర సందర్భంగా సారవకోట, హిరమండలాల నుంచి వచ్చే వాహనాలకు మార్కెట్ యార్డు వద్ద పార్కింగ్ ఉంటుంది. పర్లాకిమిడికి వెళ్లే వాహనాలు తహసీల్దార్ కార్యాలయం మీదుగా తిడ్డిమి ఆల్ ఆంధ్ర రోడ్డు, బైరాగిపేట, దశరథపురం, అంతరాబ కూడలి మీదుగా వెళ్లాలి. మెళియాపుట్టి, కొత్తూరు మండలాల నుంచి వచ్చే వాహనాలకు పాతపట్నం ఆర్టీసీ పక్కన ఉన్న పార్కింగ్ స్థలం ఉంటుంది. పాతపట్నం వచ్చే వాహనాలకు ఆస్పత్రి కూడలి, బ్రాహ్మణవీధి మీదుగా మెయిన్ రోడ్డుకు చేరుకోవచ్చని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

జయప్రదం చేయాలి

కొత్తూరు: పాతపట్నంలో నిర్వహించనున్న సామాజిక బస్సు యాత్రను నియోజవర్గం ప్రజలు జయప్రదం చేయాలని కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ కోరారు. కొత్తూరులో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బస్సు యాత్ర విజయవంతం అయ్యేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు.

'బస్సుయాత్రకు తరలిరండి'

ఎల్.ఎన్.పేట: పాతపట్నంలో బుధవారం నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్రకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కోరారు. మంగళవారం పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నవతల జంక్షన్ జాతీయ రహదారి వద్దకు చేరుకోవాలన్నారు. నవతల జంక్షన్ నుంచి పాతపట్నంలోని బస్సు యాత్ర బహిరంగ సభా ప్రాంగణం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర స్థాయి నాయకులు బస్సు యాత్ర బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. అందరి సంక్షేమాన్ని కోరే జగనన్న ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న బస్సు యాత్రలో అన్ని వర్గాల వారు పాల్గొనాలని కోరారు.

సాధికార బస్సుయాత్ర సాగుతుందిలా..

ఎల్.ఎన్.పేట: పాతపట్నంలో బుధవారం సామాజిక సాధికార బస్సు యాత్ర షెడ్యూల్‌ను ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటించారు. బుధవారం మధ్యాహ్నం 12:30 గంటలకు కాగువాడలోని ఓ కల్యాణ మండపంలో ప్రెస్ మీట్ ఉంటుంది. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి విశ్రాంతి, మధ్యాహ్నం 2.30 గంటలకు బూరగాం గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం, అనంతరం ర్యాలీగా వెళ్లి సాయంత్రం 3.00 గంటలకు పాతపట్నంలో బహిరంగ సభ ఉంటుంది.

'ఉన్నతి'తో మహిళల ఆర్థికాభివృద్ధి


లబ్ధిదారు రాణిపోలమ్మకు ఆటోను అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: రాష్ట్రంలో అణగారినవర్గాల్లోని మహిళల అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతి పథకాన్ని అమలు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మబగాంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉన్నతి లబ్ధిదారు కె.రాణి పోలమ్మకు రాయితీపై అందజేసిన ఆటోను మంగళవారం అందించారు. చీడివలస గ్రామానికి చెందిన శ్రీవిజయదుర్గ మహిళా సంఘానికి 10 శాతం బెనిఫిషరీ కంట్రిబ్యూషన్ ద్వారా ఆటోను అందజేశారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, ఏపీఎం రాజారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన


సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: గ్రామాల్లో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని బురిడికంచరాం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగన్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసి నవరత్నాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలను సీఎం జగన్ చేరువ చేశారన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన చేస్తున్నారన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడ ఎంతో ఆనందంగా ఉందన్నారు. జగనన్నను మరోసారి సీఎంను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, నాయకులు బాడాన సునీల్‌కుమార్, గంట్యాడ రమేష్, బొత్సరమణ, పీరుసాహెబ్, పిన్నింటి అప్పలనాయుడు, వాళ్లరమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పలు గ్రామ సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయం పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియజేశారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి గల వ్యత్యాసాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్


నరసన్నపేట: తెలగవలసలో అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


పోలాకి: చీడివలసలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


సారవకోట: గొర్రిబందలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


పొందూరు: దళ్లవలసలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

రీ సర్వే వేగవంతం చేయాలి

- టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్


మాట్లాడుతున్న టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

పాతపట్నం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను పూర్తిచేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని బీసీ కమ్యూనిటీ హాల్‌లో భూ రీసర్వేపై పాతపట్నం, ప్రహరాజపాలెం రైతులతో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. రైతులు రీసర్వేకు పూర్తిగా సహకరించాలన్నారు. రీసర్వేలో ప్రస్తుతం ఉన్న రైతులు తమ పేరుతో రికార్డులు నమోదు చేసుకోవాలన్నారు. పాత రికార్డుల్లో పేర్లు తమ కుటుంబ సభ్యులు ఉంటారని, ఇప్పుడు మీ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వారసత్వ భూములకు మీ పేరు పెట్టుకోవాలన్నారు. రెవెన్యూ పరిధిలోని ఉన్న రైతులు తమ పేర్లు సరి చూసికోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్ర, డీటీ ప్రసాదరావు, ఎంపీటీసీ పి.రేణుక, ఎస్.జోగారావు, పి.మోహన్, ఎ.లోకనాథం, రాజారావు, కర్రెన్న, నరేష్, పాతపట్నం, కాపుగోపాలపురం, హరిజన గోపాలపురం, ప్రహరాజపాలెం, కొదూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలతో పారదర్శకత

జలుమూరు: ఉపాధి పనుల నిర్వహణ అనంతరం సామాజిక తనిఖీలు, ఆడిట్ చేపట్టడంతో మరింత పారదర్శకత ఉంటుందని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. జలుమూరులోని ఉపాధి కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ సభకు హాజరయ్యారు. శతశాతం ఉపాధి పనులు కల్పించేలా క్షేత్ర, సాంకేతిక సిబ్బంది బాధ్యతతో పని చేయాలన్నారు. ఎక్కువగా మస్టర్లలో సంతకాలు లేకపోవడం, నేమ్ బోర్డులు పని దగ్గర లేనట్లు సోషల్ ఆడిట్ బృందం గుర్తించినట్లు నివేదికల్లో వెల్లడైందన్నారు. అల్లాడపేటకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పంగ వెంకటరమణ వేతనదారులకు ఉపాధి కల్పించడం, రికార్డుల నిర్వహణ పక్కాగా చేయడంపై అభినందించారు. గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది వరకు మొత్తం 1562 పనులు జరగ్గా వేతనదారులకు రూ.18,76,19,947 చెల్లించామన్నారు. మెటీరియల్‌కు రూ.3,38,93,026 చెల్లించినట్లు ఎస్ఆర్పీ వెంకటరమణ తెలిపారు. పూర్తి స్థాయి నివేదిక అనంతరం ఎంతమేర అవినీతి జరిగింది, ఇందులో అపరాధ రుసుం ఎంత అన్నది బుధవారం తెలియజేస్తామన్నారు. ఎంపీపీ వాన గోపి, జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు, పాతపట్నం, నరసన్నపేట ఏపీడీలు పంచాది రాధ, మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, ఈసీ సోమేశ్వరరావు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ఆమదాలవలస: స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక మంగళవారం నిర్వహించారు. విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ హాజరయ్యారు. మండలంలోని దూసి గ్రామానికి చెందిన జె.త్రినాథరావు వ్యవసాయ బోర్‌వెల్ సర్వీస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆమదాలవలస పట్టణంలో కొత్తగా విద్యుత్ సర్వీస్ కోసం జె.వెంకటరావు దరఖాస్తు అందించారు. ఆధార్ డీ-సీడింగ్ చేయాలని మరో ఇద్దరు విన్నవించారు. ఈ సమస్యలు సత్వరం పరిష్కరిస్తామని సత్యనారాయణ అన్నారు. ఆమదాలవస పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో విద్యుత్ సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫోరం మెంబర్ ఎస్.హరిబాబు, విద్యుత్ శాఖ ఏఈ రామారావు పాల్గొన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు


కొరపాం తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- తాగునీటి కుళాయిల ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొరపాం గ్రామంలో రూ.13.50 లక్షల నిధులతో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా నిర్మించిన ఇంటింటికీ తాగునీటి కుళాయిల కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. చేపానపేట, బుడితిపేట, సూరపునాయుడుపేట గ్రామాల్లో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తాగునీటి కుళాయి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయి నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదిక జరుగుతుందన్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సోమరాజు జగన్నాథం, పార్టీ నాయకులు చేపాన కృష్ణారావు, చేపాన జనార్దనరావు, శ్రీరాములు, మల్లేశ్వరరావు, అప్పారావు, లక్ష్మీనారాయణ, మానుకొండ రమణ, సోమరాజు తేజేశ్వరరావు, ఎన్ని రామచంద్రరావు, బగ్గు కుమార్, మెట్ట ఆనందరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎం.చంద్రమౌళి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.